# ప్రజా పాలనతో ప్రజలకు పథకాలు చేరువ



నకిరేకల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం




మిర్యాలగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

• నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్, డిసెంబర్ 30 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రజా పాలన కార్యక్రమం చేపట్టినట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం నకిరేకల్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో, చందుపట్ల, మర్రూర్, కట్టంగూర్ మండలం అయిటిపాముల, నార్కట్‌పల్లి మండలం లింగోటం, చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ద్వారా ఐదు పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆరు గ్యారెంటీలు అందుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో నకిరేకల్, చిట్యాల మున్సిపల్ చైర్మన్లు శ్రీనివాస్, కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, కమిషనర్ బాలాజీ, ప్రత్యేకాధికారులు పాండు నాయక్, గౌతమ్‌రాజ్, విద్యాసాగర్, కట్టంగూర్ ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, రమేశ్ దీన్‌దయాల్, యాదగిరి, తాసీల్దార్లు గుగులోతు ప్రసాద్‌నాయక్, డొంకెన స్వప్న, పద్మ, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరణ

నియోజకవర్గంలోని రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం, ఔరవాణి, పల్లెపహాడ్, షాపల్లి, కట్టంగూర్ మండలం ఈదులూరు, అయిటిపాముల, నకిరేకల్ మండలం చందుపట్ల, మర్రూర్, కేతేపల్లి మండల భీమారం, బొప్పారం, చిట్యాల మండలం పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి గ్రామాల్లో శనివారం మూడవ రోజు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నియోజకవర్గంలోని అరు మండలాల్లో 12,450 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

### అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం : ఎమ్మెల్యే బీఎల్ ఆర్

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలకు గానూ అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ అన్నారు. శనివారం మిర్యాలగూడ, దామరచర్లలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఆయన పాల్గొని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు ఫారాలు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తున్నందున ఎక్కడా కొనాల్సిన పనిలేదన్నారు. ఎవరైనా దరఖాస్తు ఫారాలు అమ్మినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్‌కార్డు లేని వారు సైతం పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు, మెప్మా పీడీ కరుణాకర్, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, గుంజ చంద్రకళ శ్రీనివాస్, గంధం రామకృష్ణ, కోడిరెక్క ఇంద్రకుమార్, బక్కయ్య, అబ్దుల్లా, విష్ణు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### నల్లగొండలో 10,195 దరఖాస్తులు

నల్లగొండ : నియోజకవర్గంలో శనివారం నల్లగొండ మున్సిపాలిటీతో పాటు కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శనివారం నియోజకవర్గం మొత్తంలో 10,195 దరఖాస్తులు రాగా మూడు రోజుల్లో మొత్తంగా 22,383 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కేంద్రంతో పలు మండలాల్లో ఆర్డీఓ రవి పర్యటించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు తాసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేవరకొండ : నియోజకవర్గంలో శనివారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించిన అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దేవరకొండ మున్సిపాల్టీలో 4087 దరఖాస్తులు అందినట్లు కమిషనర్ వెంకటయ్య తెలిపారు. దేవరకొండ మండం కొండబీమనపల్లి, ముదిగొండ, మైనంపల్లి, పద్మట్‌పల్లి, తాటికోల్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి 687 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ శర్మ తెలిపారు. కొండమల్లేపల్లి మండంలోని గుమ్మడవెల్లి, దోనియాల, చెన్నంనేని పల్లి గ్రామాల్లో గ్రామ సభల ద్వారా 981 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ బాలరాజ్‌రెడ్డి తెలిపారు. చింతపల్లి మండంలోని తీదేడులో, చందంపేట, నేరేడుగొమ్మ, పీఏపల్లి, డిండి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

### సాగర్ నియోజకవర్గంలో..

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో శనివారం హాలియా, నందికొండ మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం, మధారిగూడెం, కొట్టాల, త్రిపురారం మండలం దుగ్యాపల్లి, సత్యనారాయణపురం, జి.అన్నారం, మర్రిగూడెం, నిడమనూరు మండలం సూరేపల్లి, నందికొండవారిగూడెం, వడ్డెరగూడెం, పార్వతీపురం, గుర్రంపోడు మండలంలోని చామలోనిబావి, కాల్వపల్లి, జూనూతల, చింతగూడెం, ఆమలూరు, తిరుమలగిరిసాగర్ మండలం జువ్విచెట్టుతండా, నేతాపురం, చిలుకాపురం, సఫావత్‌తండా, ఎల్లాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మాశ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ భరతీభాస్కర్‌నాయక్, తాసీల్దార్ జయశ్రీ, గాజుల ప్రమీల, జంగాల కృష్ణయ్య, యాదగిరి, తౌఫిక్‌అహ్మద్, ఎంపీడీఓ గోళ్ల లక్ష్మి, అలువేలు మంగమ్మ, ప్రమోద్‌కుమార్, పల్లెబోయిన రామలింగయ్య, ఖాజ అజ్గర్‌అలీ, శ్రీపాద సుధాకర్, దుర్గాప్రసాద్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోని చొల్లేడు, దుబ్బకాల్వ, రత్తిపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో జడ్పీటీసీ నారబోయి స్వరూపరాణి పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. మర్రిగూడ మండలంలోని కొండూరు, మేటిచందాపురం, తమ్మడపల్లి, సరంపేట గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తిప్పర్తి : దరఖాస్తులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

## ప్రజాపాలన రసీదుపై ఆశ వర్కర్ల సంతకాలు

నకిరేకల్, డిసెంబర్ 30 : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ప్రజలు అందించిన దరఖాస్తు ఫారాలను అధికారులు కాకుండా ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సమభావన సంఘం లీడర్లు తీసుకొని, రసీదులపై కూడా వారే సంతకాలు పెట్టారు. రసీదు పత్రంలో అధికారులు సంతకం పెడితే ప్రజల్లో నమ్మకం ఉంటుందనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి, ప్రతి గ్రామసభకు ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ చందుపట్ల నిర్వహించిన గ్రామ సభలో మాత్రం ఆశ వర్కర్లే ఫారాలు తీసుకొని రసీదుపై సంతకాలు పెట్టి ఇచ్చారు. సభలో కేవలం 6 టేబుళ్లు మాత్రమే వేయడంతో దరఖాస్తుదారులు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అభయ హస్తం దరఖాస్తు ఫారంలో రేషన్ కార్డు ఆప్షన్ లేకపోవడంతో.. ప్రజలంతా అక్కడి అధికారులకు ఈ విషయమై అడిగారు. దాంతో రూ.10 ఇస్తే జిరాక్స్ షాపు వాళ్లు ఇస్తారు అంటూ అధికారులు సమాధానం ఇవ్వడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.

**కలెక్టరేట్ మీటింగ్‌కు వెళ్లా : ఎంపీడీఓ**

చందుపట్ల గ్రామంలో మధ్యాహ్నం వరకూ ప్రజాపాలన రసీదులపై నేనే సంతకం పెట్టాను. సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్‌కు వచ్చాను. ప్రజలు ఇబ్బందులు పడొద్దని మిగతావి కార్యదర్శి శంకర్‌కు అప్పగించాను. కానీ ఆశవర్కర్లు, హెల్త్ అసిస్టెంట్ల సంతకాలు పెట్టారనే విషయం నాకు తెలియదు. ఇకపై అలా జరగకుండా చూస్తా.

**నిడమనూరులో దరఖాస్తుల కొరత**

నిడమనూరు : అభయ హస్తం దరఖాస్తుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నిడమనూరు మండల కేంద్రంలో ప్రజలకు అధికారులు దరఖాస్తులు పంపిణీ చేశారు. జనం ఎక్కువగా రావడంతో చాలా మందికి దొరకలేదు. దాంతో చాలా మంది దరఖాస్తు ఫారాల కోసం జిరాక్స్ సెంటర్లు, ప్రైవేట్ నెట్ సెంటర్లను ఆశ్రయించగా.. ఆయా కేంద్రాల వాళ్లు ఒక్కో ఫారానికి రూ.30 నుంచి రూ. 50 వసూలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

## కక్షిదారుల సత్వర న్యాయానికే 'లోక్ అదాలత్'

• నల్లగొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు

రామగిరి, డిసెంబర్ 30 : కక్షిదారులు రాజీ పద్ధతిలో కేసులు పరిష్కరించుకుని సత్వర న్యాయానికే లోక్ అదాలత్‌ల నిర్వహణ అని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా నల్లగొండ కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో సమయం, ధనాన్ని ఆదా చేసుకోవచ్చని, దీనికి రాజీ మార్గమే రాజ మార్గమని పేర్కొన్నారు. క్రిమినల్, అన్ని రకాల సివిల్ కేసులు కక్షిదారుల సమ్మతితో పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడిన సివిల్ కేసుల ఫిర్యాదుదారుడు కోర్టుకు చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి వారికి చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం రాజీ మార్గంతో పరిష్కరించుకున్న కక్షిదారుల కేసు సంబంధించిన పత్రాలు అందించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి బి.తిరుపతి, ఫ్యామిలీ కోర్టు జడ్జి సి.దుర్గాప్రసాద్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు నిమ్మల బీమార్జున్‌రెడ్డి, ఎం.లెనిన్‌బాబు, బార్ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

## ఎంజీయూ కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 30: మహాత్మాగాంధీ యూనివర్సిటీ 2024 సంవత్సర క్యాలెండర్‌ను శనివారం వీసీ ప్రొఫెసర్ సీహెచ్. గోపాల్‌రెడ్డి వర్సిటీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విద్యార్థులకు విద్యను మరింత చేరువ చేసేలా మెరుగైన విద్యా ప్రమాణాలను నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. అనంతరం యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టోర్స్‌ను వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆకుల రవి, డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సెల్ కొప్పుల అంజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు

నందికొండ, డిసెంబర్ 30 : నందికొండ హిల్‌కాలనీలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలను విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ గౌడ్ శనివారం ప్రారంభించారు. జిల్లా నెట్‌బాల్ క్రీడా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ పోటీల్లో 22 జిల్లాల నుంచి 24 జట్లు పాల్గొంటున్నాయని, మూడు రోజుల పాటు క్రీడలు కొనసాగుతాయని తెలిపారు. మొదటి రోజు బాలుర, బాలికల విభాగాల్లో జగిత్యాలపై నల్లగొండ జట్లు విజయం సాధించాయి.

## వేడుకల్లో నిబంధనలు పాటించాలి : ఎస్పీ

నల్లగొండ సిటీ, డిసెంబర్ 30 : నిబంధనలు పాటిస్తూ న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ అపూర్వరావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వేగంగా వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తొలగించి వాహనాలు నడపడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజేలు, శబ్ద కాలుష్యంతో ఇతరులకు ఇబ్బంది కలిగించే వాటికి అనుమతి లేదని తెలిపారు. కేరింతలు కొడుతూ తోటి వారికి ఇబ్బంది కలిగించే వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆరు బయట మద్యం సేవిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం, బార్ షాపులు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవింగ్ అనుమతించవద్దని సూచించారు. కొవిడ్ ముప్పు నేపథ్యంలో వీలైనంత వరకు ప్రజలు తమ కుటుంబసభ్యులతో కలిసి ఇండ్లలోనే వేడుకలు జరుపుకోవాలన్నారు.

## 'కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయాలి'

రామగిరి, డిసెంబర్ 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు 1969 ఉద్యమకారులకు ఇచ్చినట్లుగా బెనిఫిట్స్ అమలు చేయాలని నల్లగొండకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పెరిక కరణ్‌జయరాజు డిమాండ్ చేశారు. శనివారం ఎన్జీ కళాశాల మైదానంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు.